


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| శుక్రవారం 15 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 347 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## ఖరీఫ్ పంటలకు మద్దతు ధరలు పెంపు

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 15, ప్రతినిధి: దేశవ్యాప్తంగా రైతులకు ఊరటనిచ్చేలా కేంద్ర కేబినెట్ ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. రైతుల ఉత్పత్తి వ్యయంపై అదనంగా 50 శాతం లాభం వచ్చేలా MSPలను నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మద్దతు ధరల అమలుకు రూ.2.60 లక్షల కోట్లను కేటాయించినట్లు తెలిపింది. కొత్త ధరల ప్రకారం సాధారణ వరి క్వింటాలుకు రూ.2,441, గ్రేడ్-ఏ వరి రూ.2,461గా నిర్ణయించగా, హైబ్రిడ్ జొన్నలు రూ.4,023, మల్దండి జొన్నలు రూ.4,073, సజ్జలు రూ.2,900, మొక్కజొన్న రూ.2,410గా ఖరారు చేశారు. అలాగే కందులు రూ.8,450, పెసర్లు రూ.8,780, మినుములు రూ.8,200గా నిర్ణయించారు. పత్తి మధ్యరకం రూ.8,267, లాంగ్ స్టేపుల్ కాటన్ రూ.8,667గా ఖరారు చేశారు. వేరుశనగ రూ.7,517, పొద్దుతిరుగుడు రూ.8,343, సోయాబీన్ రూ.5,708, నువ్వులు రూ.10,346, ఒడిసలు రూ.10,052గా మద్దతు ధరలను కేంద్రం నిర్ణయించింది. రైతులకు లాభదాయకమైన ధరలు అందించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర అధికారులు పేర్కొన్నారు.

## బీసీ గురుకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 15, ప్రతినిధి: హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురంభీం భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ "విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం" అనే సూక్తిని గుర్తుచేస్తూ విద్య వినయాన్ని పెంపొందిస్తుందని, వినయం వ్యక్తిని గొప్ప స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకే ఉందని, బానిసత్వం నుంచి బయటపడేందుకు విద్యే ఆయుధమని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతిరావు ఫూలే పేర్కొన్న విషయాలను గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని, విద్య ఎవరి సొత్తు కాదని, సరస్వతి దేవికి రంగు రూప భేదాలు ఉండవని తెలిపారు. విద్యపై చూపే ఏకాగ్రతే వ్యక్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని పేర్కొన్నారు. గురుకులాల్లో ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని, విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలని, వందేళ్లుగా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం నిర్వహించిందని తెలిపారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు 25 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించినట్లు వెల్లడించారు. అవకాశాలను సృష్టించుకున్నవారే సమర్థులవుతారని, భవిష్యత్తులో విద్యార్థులు అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఎన్నికై దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే చట్టాలు చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

## సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్లకు అవకాశం







సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 15, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థలో మహిళా శక్తికి ప్రాధాన్యత కల్పించే దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా మహిళలను నియమించేందుకు యాజమాన్యం చర్యలు ప్రారంభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్‌బర్డెన్ రవాణాకు ఉపయోగించే 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను ఇప్పటివరకు పురుషులు మాత్రమే నడుపుతుండగా, ఇకపై మహిళలకు కూడా ఈ అవకాశాన్ని కల్పించనున్నారు. ఈ డంపర్ల నిర్వహణకు శారీరక దృఢత్వం, నైపుణ్యం, కఠిన పరిస్థితుల్లో పని చేసే సామర్థ్యం అవసరమవుతుందని అధికారులు పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులు కోరగా మొదట 35 మంది ఆసక్తి చూపినట్లు తెలిపారు. వీరికి సిరిసిల్లలోని తెలంగాణ డ్రైవింగ్ విద్యా, నైపుణ్య సంస్థ ద్వారా కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు డంపర్ ఆపరేటర్లుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకాల్లో వీరికి అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠిన విధుల్లో మహిళలకు కూడా సమాన అవకాశాలు కల్పించడం సింగరేణిలో విప్లవాత్మక మార్పుగా అధికారులు పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ భారీ డంపర్లను నడపగలమో లేదో అన్న సందేహం మొదట ఉన్నప్పటికీ శిక్షణ అనంతరం తమలో ఆత్మవిశ్వాసం పెరిగిందని తెలిపారు. ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న నేపథ్యంలో గనుల్లో డంపర్లను నడపడం కూడా సాధ్యమేనని చెప్పారు. మహిళలకు ఇలాంటి అవకాశాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్‌కాస్ట్ గనిలో మహిళలతో ప్రత్యేక బ్లాస్టింగ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు, ఇతర క్లిష్ట విభాగాల్లో కూడా మహిళలు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని క్లిష్టతర ఉద్యోగాల్లో మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

## మీసేవ వాట్సాప్‌లో డీఈఈసెట్ హాల్ టికెట్లు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 15, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం డీఈఈసెట్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లను మీసేవ వాట్సాప్ సేవల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు మే 15 ఉదయం 10 గంటల నుంచి వాట్సాప్ ద్వారా తమ హాల్ టికెట్లను సులభంగా పొందవచ్చని అధికారులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న డీఈఈసెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ముందుగా అధికారిక మీసేవ వాట్సాప్ నంబర్ 8096958096ను "మీసేవ తెలంగాణ" పేరుతో సేవ్ చేసుకుని వాట్సాప్‌లో "హాయ్" అని సందేశం పంపాలి. అనంతరం "డీఈఈసెట్ హాల్ టికెట్" అని టైప్ చేసి కనిపించే "సేవ ప్రారంభించండి" ఎంపికపై క్లిక్ చేయాలి. తరువాత చెల్లింపు గుర్తింపు సంఖ్య, దరఖాస్తు సంఖ్య, మొబైల్ నంబర్, జన్మతేదీ వంటి వివరాలు నమోదు చేయగానే హాల్ టికెట్ వాట్సాప్‌లో అందుబాటులోకి వస్తుందని అధికారులు వివరించారు. ఈ సేవల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు పరీక్షలకు సంబంధించిన సేవలు వేగంగా, పారదర్శకంగా అందుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు మరింత సులభమైన డిజిటల్ సేవలను అందించాలనే లక్ష్యంతో సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో మీసేవ సేవలను విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. 2025 నవంబర్ 18న ప్రారంభించిన మీసేవ వాట్సాప్ సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, జనన ధృవపత్రాలు, ఆదాయ ధృవపత్రాలు, పోలీసు చలాన్లు, విద్యుత్ బిల్లులు, విద్యా ఫలితాల సేవలను ప్రజలు అధికంగా వినియోగిస్తున్నట్లు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ తెలిపారు.




## పర్యాటకాభివృద్ధికి 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 15, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం పర్యాటకం, వారసత్వ సంపద, సంస్కృతి, ఆతిథ్య రంగాలు మరియు యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా థీమ్–10 వారోత్సవాలను మే 18 నుంచి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనుంది. పర్యాటక శాఖ, జాతీయ పర్యాటక మరియు ఆతిథ్య నిర్వహణ సంస్థ, వారసత్వ శాఖ, భాషా సాంస్కృతిక శాఖ, యువజన అభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. తెలంగాణను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణ, యువతలో పర్యాటక అవగాహన, సాంస్కృతిక పరిరక్షణ, ఆతిథ్య నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మే 18న రాష్ట్రవ్యాప్తంగా వారసత్వ నడకలు, రేమండ్స్ సమాధుల వద్ద పర్యాటక చైతన్య కార్యక్రమాలు, వారసత్వ పర్యాటక అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక ఆవిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. అదే రోజు హైదరాబాద్ ప్రజావనంలోని రాష్ట్ర మ్యూజియంలో అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని నిర్వహించనుండగా, రవీంద్రభారతిలో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటక, ఆతిథ్య రంగాల్లో అవకాశాలపై ప్రత్యేక ఉపాధి మార్గదర్శక శిబిరాలను కూడా నిర్వహించనున్నారు. వారంరోజుల పాటు ఖజానా భవనం సహా పలు పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు చేపట్టనుండగా, ప్రతి జిల్లాలో స్థానిక పర్యాటక ప్రభావశీలులు, దృశ్య మాధ్యమ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. యువ పర్యాటక క్లబ్బుల ఎంపిక కోసం ప్రత్యేక కార్యాచరణను అమలు చేయనున్నారు. వారసత్వ శాఖ ఆధ్వర్యంలో గన్‌ఫౌండ్రీ, పైగాహ్ సమాధులు, పంగళ్, శతాబ్ది వారసత్వ మ్యూజియం వంటి ప్రదేశాల్లో శుభ్రత కార్యక్రమాలు, మొక్కల తొలగింపు చర్యలు చేపట్టనున్నారు. రవీంద్రభారతిలో ప్రతిరోజూ జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, సంగీత కచేరీలు, సాహిత్య కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మే 23న హైదరాబాద్‌లో "పర్యాటక సదస్సు–2026" పేరుతో తెలంగాణ పర్యాటక భవిష్యత్ అవకాశాలపై ప్రత్యేక సమావేశం జరగనుంది. కార్యక్రమాల ముగింపు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలు, వారసత్వ కట్టడాల వద్ద శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి, జిల్లా కలెక్టర్లు తెలంగాణ పర్యాటక గుర్తింపు కిట్‌ను విడుదల చేయనున్నారు. తెలంగాణను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 15, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి కనీస మద్దతు ధర పథకం కింద మొక్కజొన్న కొనుగోళ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం వేగవంతమయ్యాయి. మే 12న జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి 15 రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలని, రైతులు తీసుకొచ్చే నాణ్యమైన ప్రతి గింజ మొక్కజొన్నను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో వాహనాలు, హమాలీలు, గన్నీ సంచులు, గిడ్డంగుల స్థలం సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని, వర్షాల నుంచి నిల్వలను రక్షించాలని, రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రవాణా సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమీక్షకు ముందు రోజువారీ సగటు కొనుగోలు 40 వేల నుంచి 45 వేల మెట్రిక్ టన్నులుగా ఉండగా, మే 13 నాటికి అది 50 వేల మెట్రిక్ టన్నులకు పెరిగింది. గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 9,87,413 మెట్రిక్ టన్నుల నుంచి 11,67,413 మెట్రిక్ టన్నులకు పెంచగా, అదనంగా 1,80,000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సృష్టించారు. గిడ్డంగుల్లో నిల్వ చేసిన మొక్కజొన్న పరిమాణం 4,93,527 మెట్రిక్ టన్నుల నుంచి 6,50,448 మెట్రిక్ టన్నులకు పెరిగింది. గన్నీ సంచుల సరఫరా మెరుగుపడగా, హమాలీ సదుపాయాలు బలోపేతం చేశారు. రవాణా శాఖ సహకారంతో వాహనాల కొరతను గణనీయంగా తగ్గించినట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్లు కొనుగోలు ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ అర్హులైన ప్రతి రైతు కనీస మద్దతు ధరకు తన మొక్కజొన్నను విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ మార్క్‌ఫెడ్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగవంతమైన కొనుగోళ్లు నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.




## మక్క రవాణాలో అక్రమ వసూళ్లపై ఫిర్యాదు

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 15, ప్రతినిధి: మక్క రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని లారీ టిక్కీల పేరిట అక్రమ వసూళ్లు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ మండల పార్టీ నాయకులు చింతకాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్కెట్‌కు మక్క పంట తరలించే లారీల విషయంలో కృత్రిమ కొరత సృష్టించి, లారీ కాంట్రాక్టర్ భద్రం రైతుల నుంచి ఒక్కో టిక్కీకి రూ.50 నుంచి రూ.100 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెబుతున్నప్పటికీ, కొందరు దళారులు రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రైతు పండించిన ప్రతి గింజకు సరైన ధర దక్కాలని, రవాణా వ్యవస్థలో అక్రమ వసూళ్లను అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతుల శ్రమను దోచుకునే వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చింతకాని ఎస్ఐకి వినతిపత్రం సమర్పించారు. రైతు శ్రేయస్సే తమ ధ్యేయమని, రైతుల సమస్యలపై పోరాటం కొనసాగుతుందని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాజీ ఎంపీపీ రత్నాకర్, మాజీ వైస్ ఎంపీపీ హనుమంతరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగయ్య నారపోగు, నాయకులు గడ్డం శ్రీను, సర్పంచ్ పరిశుద్ధరావు, నన్నక గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.




## చింతకాని కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గోపి యాదవ్ ప్రమాణస్వీకారం

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 15, ప్రతినిధి: చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కన్నెబోయిన గోపి యాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ పాల్గొని గోపి యాదవ్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించాలని నాయకులకు సూచించారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని గోపి యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బతుకు భారమై... జీవితం అవిటిదై





సందేశం టైమ్స్, చింతకాని, మే 15, ప్రతినిధి: చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గుర్రం నాగేశ్వరరావు కుటుంబాన్ని వరద విషాదం తీవ్రంగా దెబ్బతీసింది. 2024లో కురిసిన భారీ వర్షాలు, తుపాను ప్రభావంతో మున్నేరు వరదలు ఉద్ధృతంగా ప్రవహించగా అనేక కుటుంబాలు నష్టపోయాయి. ఆ బాధితుల్లో నాగేశ్వరరావు కుటుంబం కూడా ఒకటి. వరదలు తగ్గాయని భావించి భార్య వసంతతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన నాగేశ్వరరావు ఖమ్మం-దంసలాపురం ఫ్లైఓవర్ సమీపానికి చేరుకోగానే బురదలో వాహనం జారి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో వసంత తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, నాగేశ్వరరావుకు కుడిచేయి విరిగింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో మెరుగైన చికిత్స అందించినప్పటికీ ఆయన చేయి పూర్తిగా పనిచేయకుండా పోయింది. దీంతో వికలాంగుడిగా మారిన నాగేశ్వరరావు ప్రస్తుతం ఒక్క చేత్తోనే జీవనం సాగిస్తున్నాడు. భార్యను కోల్పోయి ఇద్దరు కుమారుల బాధ్యతలు మోస్తున్న ఆయన శారీరక వైకల్యంతో పనులు చేయలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ప్రమాదం జరిగి దాదాపు ఏడాది ఎనిమిది నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి రావాల్సిన శ్రీనిధి బీమా సాయం ఇప్పటికీ అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వికలాంగుల పెన్షన్ కోసం చేసిన ప్రయత్నాలు కూడా ఫలించకపోవడంతో కుటుంబం మరింత కష్టాల్లో పడింది. కుడిచేయి పూర్తిగా పనికిరాకపోయినా వైద్యులు 40 శాతం వికలాంగత్వమే ఉందని ధృవీకరణ పత్రం ఇవ్వడంతో పెన్షన్ మంజూరు కాలేదని తెలిపారు. కష్టపడి జీవిస్తున్న కుటుంబాన్ని ఒక్క ప్రమాదం ఛిద్రము చేసిందని, నాగేశ్వరరావుకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 15, ప్రతినిధి: రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ధాన్యం సేకరణ, తూకం, నాణ్యత ప్రమాణాలు, నిల్వ ఏర్పాట్లను మంత్రులు పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 82 నుంచి 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రూ.22 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం హమాలీలు, లారీ వాహనాల కొరత సమస్యలు ఉన్నాయని, సాధారణంగా బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చే హమాలీలు ఈసారి అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి అత్యవసర చర్యలు చేపడుతోందన్నారు. వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ఇతర అవసరాలకు కాకుండా ధాన్యం రవాణాకే వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, మంత్రులు జిల్లాల వారీగా పర్యటిస్తూ కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీరామ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, ఇంచార్జి జిల్లా మేనేజర్ సివిల్ సప్లై సునీల్ రెడ్డి, జిల్లా సహకార అధికారి గంగాధర్, కేంద్ర ఇంచార్జి రేణుక, వ్యవసాయ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు ఇంటి నుంచే పని




సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 15, ప్రతినిధి: ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు ఇంటి నుంచే పని చేసే సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేఖా గుప్తా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో వాహనాల రద్దీని తగ్గించి కాలుష్య నియంత్రణకు ఈ చర్యలు ఉపయుక్తంగా ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేయాలని కూడా నిర్ణయించారు. ప్రజల్లో బాధ్యతాభావం పెంపొందించేందుకు "నా భారతదేశం – నా కర్తవ్యం" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి సోమవారం "మండే మెట్రో" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించి మెట్రో ప్రయాణాన్ని ప్రోత్సహించేలా అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు ట్రాఫిక్ సమస్యలు, వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో కీలకంగా మారనున్నాయని అధికారులు తెలిపారు.

## చమురు సంక్షోభం నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయాలు

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 15, ప్రతినిధి: అంతర్జాతీయ చమురు సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగుల రవాణా సౌకర్యాలను మెరుగుపరచేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనుంది. ప్రభుత్వ క్వార్టర్ల నుంచి కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగుల కోసం మెట్రో స్టేషన్లను అనుసంధానిస్తూ ప్రత్యేక బస్సు సేవలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. మెట్రో, బస్సుల్లో ప్రయాణించే ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం అదనపు రవాణా భత్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల పనివేళల్లో మార్పులు చేసే ప్రతిపాదనలను కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దేశ ఆర్థిక ఆత్మరక్షణలో భాగంగా ఇంధన వినియోగాన్ని తగ్గించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. అవసరానికి మాత్రమే పెట్రోల్ వినియోగించాలని, ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు ఇంధన వినియోగ నియంత్రణతో పాటు ట్రాఫిక్, కాలుష్య సమస్యల తగ్గింపుకు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

# వ్యాపారవేత్త కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా



సందేశం టైమ్స్, వట్పల్లి, మే 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం భూత్కూర్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బగిలి మైబు షెట్ కుమార్తె వివాహ వేడుకలు గ్రామంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వజనాల విశ్వాస్, గట్‌పల్లి మాజీ సర్పంచ్ రమేష్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు వినయ్ గౌడ్ తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. గ్రామ పెద్దలు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వివాహ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, అతిథులందరికీ ఆతిథ్య సత్కారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని హాజరైన వారు ఆకాంక్షించారు.



# ఇందిరమ్మ గృహ ప్రవేశంలో కాంగ్రెస్ నాయకుల సందడి

సందేశం టైమ్స్, చౌటకూర్, మే 15, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మించిన గృహ ప్రవేశ కార్యక్రమం చౌటకూర్ మండలంలోని కోర్పోల్ గ్రామంలో ఘనంగా నిర్వహించబడింది. గ్రామానికి చెందిన బోయిని విష్ణు తన ఇందిరమ్మ ఇంటిని పూర్తి చేసి గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు హాజరై నూతన గృహ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సార సంజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు పోతిరెడ్డిపల్లి మహిపాల్ రెడ్డి, మండల యువజన అధ్యక్షుడు దానంపల్లి సుధాకర్‌తో పాటు గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి స్వంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.



# గణేష్ గడ్డ దేవాలయ అభివృద్ధికి కృషి

సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 15, బి. డేవిడ్: గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయం ఆవరణలో నిర్మించిన మూడు రాజగోపురాలను ఆగస్టు 16న ప్రారంభించనున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అదే రోజు ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం ఉదయం దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అనంతరం ఆలయ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, ధర్మకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి నాలుగు వైపులా నిర్మిస్తున్న రాజగోపురాల పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఒక కోటి 50 లక్షల రూపాయల సొంత నిధులతో ఈ గోపురాలను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆలయంలో నిర్మిస్తున్న సాలహారం పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గాయత్రి పాండు, శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, నరసింహారెడ్డి, వెంకన్న, స్థానిక కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు పోస్టుకార్డ్ ఉద్యమం



సందేశం టైమ్స్, జహీరాబాద్, మే 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం మీర్జాపూర్-బి గ్రామంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రికి పోస్టుకార్డుల ద్వారా వినతి తెలిపే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా మాట్లాడుతూ మహిళలు కేవలం లబ్ధిదారులుగానే కాకుండా విధాన నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో కూడా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న మహిళలకు కీలక నిర్ణయాధికారాల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించాలని, జనాభాలో సగభాగమైన మహిళల గళాన్ని వినిపించేందుకే ఈ పోస్టుకార్డ్ ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఓబీసీ కోటాతో పాటు మహిళా రిజర్వేషన్‌ను కూడా చట్టంలో భాగంగా చేర్చి, రాబోయే జూలై నెల పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాల్కల్ మండల మహిళా కాంగ్రెస్ నాయకురాలు స్వరూప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి స్నేహ, జహీరాబాద్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ కార్యదర్శి సురేఖతో పాటు మహిళా కాంగ్రెస్ నాయకులు వహీదా బేగం, రేణుక, స్వప్న, అంబికా, కరిష్మా, గంగామణి, లలిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# పటాన్చెరు అభివృద్ధికి సహకారం అందించాలి



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 15, బి. డేవిడ్: పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ముఖ్యంగా 2025–2026 సంవత్సరానికి సంబంధించిన ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా చేపట్టబోయే పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి కోట అభివృద్ధి విషయమై హెచ్ఎండీఏ అధికారులతో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు. కోట అభివృద్ధి కోసం రెవెన్యూ శాఖ తరఫున అనుమతి పత్రం జారీ చేయాలని కోరారు. హెచ్ఎండీఏ నిధులతో వడకపల్లి కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# అనారోగ్య బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక భరోసా



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 15, జిల్లా సమన్వయకర్త: సదాశివపేట పట్టణానికి చెందిన బొడుగు స్వరూప అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్పందించారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే రూ.1 లక్ష 25 వేల ఎల్‌ఓసీ ఆర్థిక సహాయం మంజూరుకు కృషి చేసి సంబంధిత చెక్కును సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వరూప కుటుంబ సభ్యులు తమ కష్టసమయంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం అందించడం తమ బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 15, జిల్లా సమన్వయకర్త: కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ తప్పక పాల్గొనాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ప్రత్యేక సమగ్ర సవరణపై ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర సవరణపై ప్రజల్లో ఉన్న అపోహలను విడనాడాలని కోరారు. ఈ ప్రక్రియ వల్ల ఎవరి ఓటు హక్కు కోల్పోరని స్పష్టం చేశారు. రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన వారికి మాత్రమే ఒకే చోట ఓటు హక్కు పరిమితం అవుతుందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా ఓటర్లలో జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ నవాజ్, సోహైల్, బబ్బు, సంగారెడ్డి తహశీల్దార్ జైరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



సందేశం టైమ్స్, మెదక్, మే 15, ప్రతినిధి: టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా గంగారం దుర్గమ్మ తన నూతన ఇంటిలో గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుని సంప్రదాయబద్ధంగా గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గంగారం కిష్టయ్య, వాటర్‌షెడ్ కమిటీ సభ్యుడు ఎం. రవికుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంగళ్ సంగమేశ్వర్‌తో పాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని నూతన గృహ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాలకు స్వంత ఇల్లు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ పథకం ద్వారా సాకారం అవుతోందని నాయకులు పేర్కొన్నారు. గ్రామంలో ఈ గృహప్రవేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# నూతన షాపు ప్రారంభోత్సవంలో బండారి గంగాధర్





సందేశం టైమ్స్, నర్సాపూర్, మే 15, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గం పిల్లుట్ల గ్రామానికి చెందిన తలారి అశోక్, పిల్లి రవి కళ్యాణ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ సంగారెడ్డి రోడ్డులో శ్రీ విఘ్నేశ్వర ఆటోమొబైల్ జేసీబీ, ట్రాక్టర్ స్పేర్ పార్ట్స్, ఇంజన్ ఆయిల్ నూతన షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని షాప్ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. గణపతి ఆశీస్సులతో వ్యాపారం అభివృద్ధి చెంది అధిక లాభాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను యజమానులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, నర్సాపూర్ ఆర్‌ఐ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు కుమ్మరి నాగరాజు, వార్డ్ మెంబర్ గాండ్ల ఆంజనేయులు, తలారి యాదయ్య, కంటాల శ్రావణ్, ఆది శ్రీకాంత్, గొల్లపల్లి శ్రీకాంత్, నాయిని నర్సింలు, మంగళపర్తి పర్వతాలు, మంగళపర్తి కుమార్, వార్డ్ మెంబర్ గుర్రాల కుమార్, శ్రీశైలం యాదవ్‌తో పాటు కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక తండా బోర్డు ఏర్పాటు చేయాలి



సందేశం టైమ్స్, మెదక్, మే 15, ప్రతినిధి: గిరిజన తండాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక తండా బోర్డు ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు. బొమ్మరెడ్డిగూడెం గ్రామంలో గిరిజన సంక్షేమ సంఘం 17వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి గిరిజన మహిళలకు తినిపించారు. కార్యక్రమంలో జైపాల్ నాయక్ మాట్లాడుతూ సంఘం ఏర్పాటైనప్పటి నుంచి గిరిజనుల జీవనోపాధి, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా గిరిజన సమస్యల పరిష్కారం, సమగ్ర అభివృద్ధి కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు. గిరిజన సంక్షేమ సంఘం చేసిన పోరాటాల ఫలితంగానే తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం తండా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన కోరారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని దేశవ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలని, గిరిజనులను చైతన్యపరిచిన రామ్ రావ్ మహారాజ్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శంకర్ నాయక్, గణపతి నాయక్, హరిచంద్, మూడ్ విగేష్, బద్రీనాథ్, మూడ్ లక్ష్మణ్, పూన్య నాయక్, సంతోష్, పాండు, ఖుబ్యా నాయక్‌తో పాటు గిరిజన మహిళలు పాల్గొన్నారు.




# నిరుపేద గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యే ప్రభుత్వ లక్ష్యం: అదనపు కలెక్టర్ నగేష్

సందేశం టైమ్స్, మెదక్, మే 15, ప్రతినిధి: నిరుపేద గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో (బీఏఎస్) 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం లక్కీ డిప్ విధానంలో విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఇంగ్లీష్ మీడియంలో పూర్తిగా ఉచిత విద్యతో పాటు భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పించబడతాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మంచి విద్యా ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. లక్కీ డిప్ ద్వారా 3వ తరగతి, 5వ తరగతి, 8వ తరగతులలో సీట్లను కేటాయించారు. 3వ తరగతిలో 10 సీట్లలో 33 శాతం బాలికల కోటా కింద 3 మంది బాలికలు, మిగతా జనరల్ కోటాలో బాలురు ఎంపికయ్యారు. 5వ తరగతిలో 5 సీట్లలో బాలికల కోటా కింద 1 బాలిక, జనరల్ కోటాలో 4 మంది బాలురు ఎంపికయ్యారు. 8వ తరగతిలో 5 సీట్లలో బాలికల కోటా కింద 1 బాలిక, జనరల్ కోటాలో 4 మంది బాలురు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వి. నీలిమ, గిరిజన వసతి గృహ అధికారులు డి. లింగమూర్తి, కార్యాలయ సిబ్బంది జి. శ్రీకాంత్, సమీర్, పి. శ్రీకాంత్, కె. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకం







సందేశం టైమ్స్, మెదక్, మే 15, ప్రతినిధి: ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత కీలకమని భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ పేర్కొన్నారు. గురువారం ఎంపిక చేసిన రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికకు ముందు ఓటరు జాబితాలను నవీకరించడం ఎన్నికల సంఘం బాధ్యత అని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి 18 ఏళ్లు నిండిన భారత పౌరుడు సాధారణ నివాసితుడిగా ఉంటూ చట్టపరంగా అనర్హుడు కాకపోతే ఓటరుగా నమోదు కావచ్చని వివరించారు. యువ ఓటర్ల నమోదు, మహిళల భాగస్వామ్యం, దివ్యాంగులకు సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఇంటింటి సర్వేలు, పోలింగ్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితా నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నిర్ణీత కాలపట్టికలో ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తి చేయాలని సూచించారు. 2025 అక్టోబర్ 27 నాటికి ఉన్న ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌లు పంపిణీ చేసి, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించాలని పేర్కొన్నారు. ఫారమ్‌ల ఆధారంగా అర్హులైన వారిని మాత్రమే ముసాయిదా జాబితాలో చేర్చాలని, విచారణ లేకుండా ఎవరి పేరును తొలగించకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య 1200కు మించకుండా క్రమబద్ధీకరణ చేయాలని తెలిపారు. హై-రైజ్ భవనాలు, మురికివాడల్లో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే కేంద్రంలో ఉండేలా చూడాలని సూచించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. ముసాయిదా జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచి, పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలకు ఫారమ్ 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తుది జాబితాపై అసంతృప్తి ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణను ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అదనపు కలెక్టర్ విస్తృత పరిశీలన

సందేశం టైమ్స్, మెదక్, మే 15, ప్రతినిధి: రామాయంపేట మండలంలోని లక్ష్మాపూర్, కాట్రియాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరగాలని, ప్రతి అధికారి కేంద్రాలను సందర్శించి ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు వచ్చిన ధాన్యం పరిమాణం, కొనుగోలు వివరాలు, హమాలీల సంఖ్య, గన్నీ బ్యాగులు, టార్పాలిన్‌ల లభ్యత, లారీ రవాణా పరిస్థితి, లోడింగ్ సమయం, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ వంటి అంశాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించారు. సరిపడా హమాలీలను నియమించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని తెలిపారు. మిల్లులకు వెళ్లే ట్రక్‌లతో పాటు కేంద్ర ప్రతినిధిని పంపించి అక్కడ అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్ ఓపీఎంఎస్‌లో ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. సివిల్ సప్లైస్, సహకార, వ్యవసాయ, రవాణా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం అక్కన్నపేట గోదామును సందర్శించిన అదనపు కలెక్టర్ అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఓపీఎంఎస్ ఎంట్రీలను పూర్తిచేయాలని ఇన్‌చార్జ్‌కు సూచించారు. ప్రస్తుతం అక్కడ 40 మంది హమాలీలు పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటీఐ–ఏటీసీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం



సందేశం టైమ్స్, మెదక్, మే 15, ప్రతినిధి: ప్రభుత్వ ఐటీఐ–ఏటీసీలో ప్రవేశాల కోసం మే 25, 2026 నుండి జూన్ 8, 2026 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ–ఏటీసీ మెదక్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అడ్మిషన్‌కు అర్హతగా కనీసం 14 సంవత్సరాలు పూర్తయి, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. గరిష్ట వయోపరిమితి లేదని పేర్కొన్నారు. దరఖాస్తుకు అవసరమైన సర్టిఫికెట్లు పదవ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, 1 నుండి 10వ తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అవసరమని తెలిపారు. ఐటీఐ–ఏటీసీలో ఎలక్ట్రిషియన్ (రెండు సంవత్సరాలు), ఫిట్టర్ (రెండు సంవత్సరాలు), డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ (రెండు సంవత్సరాలు), మెకానిక్ డీజిల్ (ఒక సంవత్సరం), కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (ఒక సంవత్సరం), రోబోటిక్స్ (ఒక సంవత్సరం), మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ (ఒక సంవత్సరం), ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ (ఒక సంవత్సరం), ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నీషియన్ (రెండు సంవత్సరాలు), సీఎన్‌సీ లాథ్ ఆపరేటర్ (రెండు సంవత్సరాలు), వర్చువల్ అనాలిసిస్ డిజైనర్ (రెండు సంవత్సరాలు) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఐటీఐ–ఏటీసీ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.